ఐషర్ వ్యాన్-ఆటో ఢీ

ఆరుగురికి తీవ్ర గాయాలు

యువతి పరిస్థితి విషమం

కిమ్స్ ఆసుపత్రిలో వైద్యసేవలు

వార్త..7లో



మండపేట మండలం కేశవరంలో అక్రమార్కులు గ్రావెల్ తవ్వకాలు సాగించగా గుర్తుగా మిగిలిన సరస్సు

ఎర్ర కొండలు పిండి

జిల్లాలో మైనింగ్ గ్రావెల్ మాఫియా చెలరేగిపోతోంది. గతంలో వైసీపీ ప్రభుత్వంలో గ్రావెల్ మాఫియాకు అడ్డూఅదుపు లేకుండా ఉండేది. ఇష్టానుసారంగా గ్రావెల్ తవ్వకాలు జరిపి గోతులు మిగిల్చి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూడా ఆ సంప్రదాయం కొనసాగుతోందని పలువురు అంటున్నారు. ఇక్కడ అధికార, ప్రతిపక్ష నేతలు, గ్రావెల్ మాఫియా అక్రమార్కులు అంతా కలగలిసి ఒక్కటయ్యారు. దొరికినకాడికి దోచేస్తున్నారు. సహజ సిద్ధంగా ఏర్పడిన ఎర్రటి గ్రావెల్ కొండలను పిండి చేస్తున్నారు. ఇది ఇలానే కొనసాగితే భవిష్యత్తులో కొండలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఎర్ర కొండలను పిండి చేస్తున్న గ్రావెల్ మాఫియా
- మైనింగ్ ఆదాయానికి గండి
- అక్రమార్కులకు అండగా నిలుస్తున్న మైనింగ్, విజిలెన్స్, రెవెన్యూ అధికారులు, కూటమి నేతలు కొందరు..
- బరితెగించి పగలు, రేయి తేడా లేకుండా గ్రావెల్ అక్రమ తరలింపు
- అనుమతులు గోరంత తవ్వకాలు కొండంత


మండపేట, (ఆంధ్రజ్యోతి):

ద్వారపూడి, కేశవరం పరిధిలో..

ప్రధానంగా కోనసీమ జిల్లాలోని మండపేట మండలం ద్వారపూడి, కేశవరంలో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. అక్రమార్కులను అడ్డుకోవాల్సిన మైనింగ్ శాఖ అధికారులు కాసులకు కక్కుర్తి పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనుమతులు లేకుండా తవ్వకాలు సాగించిన వారికి మైనింగ్ శాఖ వేసిన పెనాల్టీలు ప్రభుత్వానికి జమ అయిన దాఖలాలు కనిపించడం లేదు. ముఖ్యంగా అక్రమ గ్రావెల్ తవ్వకందారులు మైనింగ్ విజిలెన్స్ అధికారులను మచ్చిక చేసుకుని వారికి ఖరీదైన పార్టీలు, బహుమతులను అందించడంతో వారు భక్తిని చాటుకుంటున్నట్లు సమాచారం.

గోరంత అనుమతులతో

మరో వైపు గ్రావెల్ తవ్వకాలకు సంబంధించి గోరంత అనుమతులతో కొండంత తవ్వకాలు సాగించేస్తున్నారు. మండపేట మండలం కేశవరం ద్వారపూడి గ్రామాల్లో ప్రభుత్వ భూములే లక్ష్యంగా రాత్రి వేళల్లో లారీలకు లారీలు తరలిపోతోంది. నిబంధనల మేరకు యూనిట్ గ్రావెల్‌కు రూ. 30 మైనింగ్ సెస్ చెల్లించాల్సి ఉండగా అలాంటి చెల్లింపులేమి లేకుండానే అధికారులు కళ్లుగప్పి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ గ్రావెల్‌ను లేఅవుట్‌లకు తరలిస్తున్నారు. మండపేట మండలం వేములపల్లిలో అనుమతులు లేకుండానే రాత్రి వేళల్లో లారీల్లో గ్రావెల్ తరలిపోతోంది. అలాగే కేశవరంలో కూడా అదే పరిస్థితి.



మండపేట మండలం కేశవరం చెంతనే గ్రావెల్ తవ్వకాలు అనంతరం మిగిలిన విద్యుత్ స్తంభం



ద్వారపూడి -కేశవరం మధ్య తవ్వకాలు

చెరువుల్లా మారిన గోతులు

ఇక అక్రమార్కుల దెబ్బకు మెట్టలో గ్రావెల్ తరలించగా పడిన గోతులు చెరువులు, సరస్సులను తలపిస్తున్నాయి. విద్యుత్ టవర్లు, హెచ్‌టీ లైన్లను అక్రమార్కులు గ్రావెల్ మాఫియా గ్యాంగ్ వదలడం లేదు. అక్రమార్కులు దెబ్బకు విద్యుత్ స్తంభాలు, హెచ్‌టీ టవర్లు కూడా ప్రమాదకర పరిస్థితికి చేరుకుంటున్నాయి. మండపేట మండలం కేశవరం, ద్వారపూడి, రాజానగరం మండలం తుంగపాడు, ఎర్రంపాలెం, సంపతనగరం తదితర ప్రాంతాల్లో గ్రావెల్ అక్రమార్కులు గ్రావెల్ తరలించగా భారీ గోతులు ప్రమాదకరంగా మారిపోతున్నాయి. అసైన్డ్ భూములు, పట్టా భూములు టార్గెట్‌గా తవ్వకాలు సాగిపోతున్నాయి. గ్రావెల్ తవ్వకాలకు సంబంధించి ఎకరాకు రూ.5 లక్షలు వరకు చెల్లిస్తే అనుమతులున్నా లేకున్నా గ్రావెల్ తవ్వకాలు సాగించవచ్చని అక్రమార్కులే బాహాటంగా చెబుతున్నారు. అనుమతి గోరంత తీసుకుని ఎంతయినా తవ్వకోండని ప్రజాప్రతినిధులు అక్రమార్కులకు భరోసా ఇవ్వటం కొసమెరుపు. అక్రమ తవ్వకాల వైపు మైనింగ్ అధికారులు కానీ విజిలెన్స్ రెవెన్యూ అధికారులు కానీ కన్నెత్తి చూసే సాహసం చేయటం లేదు. దానివల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. క్వారీ గ్రావెల్ గోతులు కారణంగా పలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మెరకలు తొలగించి పొలాలుగా మార్పు చేసుకుంటామని దరఖాస్తు చేసుకుంటున్న రైతులు భారీ లోతులో 30 నుంచి 40 అడుగుల మేర గ్రావెల్ తవ్వకాలు సాగిస్తున్నారు. గ్రావెల్ తవ్వకాలు అక్రమంగా సాగించిన వారికి పెనాల్టీలు వేసినా చెల్లించిన దాఖలాలు కనిపించటం లేదు. పగలేమో అనుమతులు ఉన్న చోట.. రాత్రివేళ అనుమతులు లేని చోట..ఇలా కొండలను పిండి చేస్తున్న కార్యక్రమం జోరుగా జరిగిపోతోంది. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమార్కులపై ఉక్కుపాదం మోపి సహజ సిద్ధంగా ఏర్పడిన ఎర్ర గ్రావెల్ కొండలను కాపాడి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు పర్యావరణ ప్రేమికులు ప్రభుత్వానికి ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.





అయినవిల్లి వినాయకుడికి

సప్తనదీ జలాలతో అభిషేకం



అభిషేక జలాలను తీసుకువస్తున్న అర్చకులు

అయినవిల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో ఆదివారం స్వామివారికి సప్త నదీ జలాభిషేకం వైభవంగా నిర్వహించారు. గంగ, యమున, సరస్వతి, గోదావరి, నర్మద, సింధు, కావేరి జలాలను కలశాల్లో ఉంచి పూజించి అర్చక స్వాములు విఘ్నేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి సప్త నదీజలాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీపంచమి సందర్భంగా శ్రీసిద్ధి వినాయక సన్నిధిలో అధిక సంఖ్యలో అక్షరాభ్యాసాలు జరిగాయి. ఆలయ మండపాలు భక్తులతో కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



స్వామి వారి సేవకు..

సిద్ధమైన వాహనాలు

ప్రత్యేక కథనం..7లో



అమలాపురం హైస్కూల్ సెంటర్‌లో రాజకీయ నాయకుల విగ్రహాలు



బండారులంక పంచాయతీ కార్యాలయం వద్ద రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు

అక్కడ అలా.. ఇక్కడ ఇలా..

ఒక్కో చోట ఒక్కోలా కోడ్ అమలు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రవర్తనా నియమావళిని అధికారులు ఒక్కోచోట ఒక్కో విధంగా అమలు చేస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన వెంటనే అమలాపురం రూరల్ మండలంలో బండారులంకతో సహా పలు గ్రామాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. అమలాపురం పురపాలక సంఘంలో మాత్రం గడియార స్తంభం సెంటర్‌లోని టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేశారు. పట్టణంలో మిగిలిన విగ్రహాలను పట్టించుకోలేదు. స్థానిక హైస్కూల్ సెంటర్‌లోని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో పాటు ఇతర రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయని అధికారుల తీరును పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో..

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలు నిర్వహించడం లేదని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసే వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించబోమన్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయిలోను, మండల కార్యాలయాల్లో మండలస్థాయిలోను నిర్వహించే మీ కోసం కార్యక్రమాలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసే వరకు నిర్వహించడం లేదని వివరించారు. కేవలం గ్రామ సచివాలయాల్లో మాత్రమే అర్జీదారులు తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చునన్నారు.

డయల్ యువర్ కమిషనర్ రద్దు..

సోమవారం అమలాపురం మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు ఆధ్వర్యంలో పట్టణంలోని సమస్యలపై నిర్వహించాల్సి ఉన్న డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని ఎన్నికల కోడ్ కారణంగా నిలుపుదల చేసినట్టు కమిషనర్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసే వరకు ఈ కార్యక్రమం నిర్వహించబోమన్నారు. మార్చి 8వ తేదీ తర్వాత నిర్వహిస్తామని ప్రకటించారు.

మంత్రులకు కల్యాణోత్సవాల ఆహ్వాన పత్రికలు





మలికిపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరు కల్యాణ తీర్థ మహోత్సవాల నేపథ్యంలో ఎన్డీఏ కూటమి నాయకులు పలువురు మంత్రులు, ప్రముఖులకు ఆహ్వానాలు పలికారు. మంత్రులు నాదెండ్ల మనోహర్, నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్‌కు ఆహ్వాన పత్రాలు అందించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, మండలాధ్యక్షుడు ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, డీసీ పినిశెట్టి బుజ్జి, ఆకన బాబ్జినాయుడు మంత్రులను ఆహ్వానించిన వారిలో ఉన్నారు.



గోదారంతా.. ఘాట్!

రాజమహేంద్రవరం పుష్కరఘాట్

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) :గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నారు. ముందస్తు చర్యలకు దిగుతున్నారు. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం, కొవ్వూరు గోదావరి పరీవాహక ఘాట్లు లింక్ చేసే యోచన చేస్తున్నారు. రాజమహేంద్రవరం వైపు కాతేరు నుంచి ధవళేశ్వరం వరకూ 7.1 కి.మీ, కొవ్వూరు వైపు గోష్పాదక్షేత్రానికి అటూ ఇటూ విస్తరించనున్నారు. ఉత్తర ప్రదేశ్ ప్రయాగలో జరుగుతున్న మహాకుంభమేళాను దృష్టిలో పెట్టుకుని 2027లో జూలైలో జరిగే గోదావరి పుష్కరాలకు కూటమి ప్రభుత్వం వ్యూహరచన చేస్తోంది.ఇప్పటి నుంచే గోదావరి పుష్కరాలకు సర్వం సన్నద్ధం కావడానికి అధికార యంత్రాంగం చర్యలు చేపడుతుంది. దీనిలో భాగంగా ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పరిధిలో గోదావరి పరిసర గ్రామాలన్నింటికీ పుష్కర శోభను తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తుంది.

గత పుష్కరాలకు ఇలా..

రాజమహేంద్రవరంలో పుష్కరాల రేవుకు దీటుగా 2003 పుష్కరాలకు కోటిలింగాల రేవును అప్పటి టీడీపీ ప్రభుత్వం 1.2 కిమీ విస్తరించింది.అప్పట్లో ఈ ఘాట్‌లోనే అత్యధికంగా భక్తజనం పుణ్యస్నానాలు ఆచరించారు. 2003 పుష్కరాలకు ఘాట్ల అభివృద్ధికి రూ.120 కోట్లు కేటాయింపులు చేశారు.అప్పట్లోనే కొవ్వూరు గోష్పాదక్షేత్రం ఘాట్‌ను అభివృద్ధి చేశారు. అటుపై 2015 పుష్కరాలకు పుష్కరాల రేవు, సర్వస్వతి ఘాట్ అభివృద్ధి చేశారు.పుష్కరాల రేవు కేవలం ప్రధాన మంచినీటి విభాగం సరిహద్దు గోడ నుంచి ఆర్చి బ్రిడ్జి వరకు మాత్రమే ఉండేది దానిని చిత్రాంగి గెస్ట్ హౌస్ వెనుక వరకు విస్తరించారు.నాటి పుష్కరాల్లో పుష్కరాల రేవు,కోటిలింగాలరేవు, టీటీడీ ఘాట్, శ్రద్ధానంద ఘాట్, గౌతమి ఘాట్, సరస్వతి ఘాట్, కాతేరు రేవు, ధవళేశ్వరం రేవులు ప్రధాన భూమిక పోషించాయి.అయినా రద్దీ అంతా రాజమహేంద్రవరం పుష్కరాలరేవు, కోటిలింగాల రేవులపై పడేది. ఈ నేపథ్యంలో గత రెండు పుష్కరాల అనుభవాలు, ప్రస్తుతం ప్రయాగలో జరుగుతున్న మహాకుంభమేళాను దృష్టిలో పెట్టుకుని తూర్పు గోదావరి జిల్లాలో గోదావరి పొడవునా ఉన్న రేవులను ఈ సారి పుష్కరాలకు వినియోగించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమౌతుంది.

పుష్కరాలకు అటూ ఇటూ ఒకటే ఘాట్

రోడ్లు విస్తరణ

పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా రేవులకు అనుసంధానంగా ఉన్న గోదావరి బండ్ రోడ్డును విస్తరించే యోచనలో ప్రజాప్రతినిధులు అధికారులు ఉన్నారు. ధవళేశ్వరం సాయిబాబా ఆలయం నుంచి ఉన్న గోదావరి బండ్ రోడ్డును రాజమహేంద్రవరం బండ్ రోడ్డు,శేషయ్యమెట్ట మీదుగా కోటిలింగాల రేవు, కాతేరు, వెంకటనగరం మీదుగా ఏటి గట్టును బేస్ చేసుకుని గోదావరి బండ్ రోడ్డును నిర్మించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. పుష్కరాలకు కోట్లాదిగా తరలి వచ్చే భక్తజనం రాజమహేంద్రవరం వరకు రాకుండానే రూరల్‌లో గోదావరి బండ్ రోడ్డులోకి వెళ్లి అక్కడ అభివృద్ధి చేసిన ఘాట్ల స్నానాలు చేసి తిరుగు ప్రయాణం అయ్యే విధంగా బండ్ రోడ్డుకు మెయిన్ రోడ్లను కనెక్ట్ చేసి నిర్మించాలనే చర్యలు అధికారులు చేపట్టనున్నారు.

- 2027 పుష్కరాలకు ఏర్పాట్లు
- 17 ఘాట్ల విస్తరణకు యోచన
- ఇప్పటి నుంచే ప్రణాళిక
- రూ.300 కోట్లతో ప్రతిపాదన
- రాజమండ్రి వైపు 7.1 కి.మీ
- కొవ్వూరు వైపు 2 కి.మీ
- ఎంపీ పురందేశ్వరి ఆదేశాలు
- అధికారుల తర్జనభర్జన
- ఏటిగట్టు రోడ్లు నిర్మాణం



కొవ్వూరు గోష్పాదక్షేత్రం

2027 గోదావరి పుష్కరాలకు ఇలా..

గోదావరి పుష్కరాలకు రాజమహేంద్రవరం, కొవ్వూరు ఘాట్లలో భక్తజనం పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఈ మేరకు ప్రధానంగా ఉన్న ఘాట్లను ఇంటర్ లింక్ చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టనున్నారు. ఎంపీ పురందేశ్వరి కూడా రాజమహేంద్రవరం, కొవ్వూరులో ఘాట్లను లింక్ చేయాలని ఆదేశించారు.ఆ దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. నగరంలో ఉన్న కోటిలింగాల రేవు నుంచి కాతేరుకు, ఇటు వైపు పుష్కరాల రేవు, కుమారి ఇసుక ర్యాంప్ రేవు, టీటీడీ ఘాట్, శ్రద్ధానంద ఘాట్, దోబీఘాట్, సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్, ధవళేశ్వరం రామపాదాల రేవులను ఇంటర్‌లింక్ చేసి సుమారు 7.1 కిలోమీటర్ల పొడవునా అతిపెద్దగా ఘాట్లను నిర్మించాలనే ఆలోచన అధికార యంత్రాంగం చేస్తుంది. అదే విధంగా కొవ్వూరు వైపు సుమారు 4 కిలోమీటర్ల మేర అఖండ గోదావరి విస్తరించి ఉంది.అక్కడ కూడా గోష్పాద క్షేత్రం నుంచి అటూ ఇటూ రెండు కి.మీ.. రేవులను విస్తరించే యోచనలో యంత్రాంగం ఉంది. 2027 గోదావరి పుష్కరాలకు ఘాట్ల ఇంటర్ లింక్‌లు కలిపి మొత్తం 17 ఘాట్లను సిద్ధం చేసేందుకు సుమారు రూ. 300 కోట్లు నిధులు కేటాయింపులు చేసే యోచనలో ఉన్నారు. ఇదే జరిగితే భక్తులకు అసౌకర్యం కలగకుండా స్నానాలు చేసి వెళ్లే పరిస్థితి ఉంటుంది.అన్ని రేవులను కలిపి పుష్కరాల రేవుగా నామకరణ చేసి బోర్డులు కూడా అందరికి స్పష్టంగా కనిపించేలా ఏర్పాట్లు చేయాలనే ఆలోచన అధికారులు చేస్తున్నారు. ఎందుకంటే 2015 పుష్కరాలకు పుష్కరాల రేవు వద్ద తొలిరోజు జరిగిన ప్రమాదంలో 22 మంది వరకూ మృత్యువాత పడిన ఘటన విదితమే. ఈ నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా రేవులు లింక్ చేసే యోచన చేస్తున్నారు.

రద్దీకి తగ్గట్టు ఘాట్ల విస్తరణ




2027లో జరిగే గోదావరి పుష్కరాలకు ప్రస్తుతం జరుగుతున్న మహాకుంభమేళాకు వచ్చిన భక్తజనానికి మించి భక్తులు వచ్చే అవకాశం ఉంది. అందుకే రద్దీకి తగ్గట్టుగా ఘాట్ల విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అన్ని ఘాట్లు పుష్కరఘాట్లే ఏ ఘాట్‌లో స్నానం చేసినా పుష్కర పుణ్యమే అనే ప్రచారం ప్రజల్లోకి తీసుకెళ్లి అన్ని రేవులకు ప్రజలు సమాంతరంగా వచ్చే విధంగా ప్రణాళికను ప్రభుత్వం చేస్తుంది. 2027 గోదావరి పుష్కరాలకు కూటమి ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేస్తుంది. ఇప్పటి నుంచే పుష్కరాల అబివద్ధి పనులు చేపడుతున్నందున అన్ని సకాలంలో పూర్తవుతాయి.

- ఆదిరెడ్డి శ్రీనివాస్,ఎమ్మెల్యే
రాజమహేంద్రవరం



స్వామివారి సేవలకు..



సిద్ధమైన వాహనాలు

- ఒక్కో వాహనానికి ఒక్కో ప్రత్యేకత
- రేపటి నుంచి 13వ తేదీ వరకు వైభవంగా లక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాలు
- ఏర్పాట్ల నిమగ్నమైన అధికార యంత్రాంగం

అంతర్వేది, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామివారికి పది రోజులపాటు నిర్వహించే కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. పది రోజులపాటు స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి 14 వాహనాల్లో గ్రామోత్సవాలు నిర్వహిస్తారు. ఆర్తజన రక్షకుడైన అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహుడికి పది రోజులపాటు జరిగే కల్యాణోత్సవాలను చూసేందుకు రెండు కనులు చాలవు. వీటిని చూసి తరించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. స్వామి వారికి జరిగే ముద్రికాలంకరణతో ప్రారంభమై స్వామివారి పవళింపు సేవతో ముగుస్తాయి.

కల్యాణోత్సవాల కోసం వాహనోత్సవాలు



సూర్యవాహనం

కల్యాణోత్సవాల్లో తొలిరోజు ఫిబ్రవరి 4న మంగళవారం రథసప్తమినాడు స్వామివారికి సూర్యవాహనంపై ఊరేగింపు జరుగుతుంది. సూర్యుడు వెలుగునిచ్చే జ్ఞాన ప్రధాత. మనుషుల్లో అజ్ఞానాన్ని పారద్రోలి జ్ఞానం అనే వెలుగును నింపేందుకు కోటి సూర్య ప్రభాససమేతుడైన శ్రీ లక్ష్మీనరసింహస్వామివారు సాయంత్రం 4.30కు సూర్యవాహనంపై గ్రామ మాఢ వీధుల్లో ఊరేగుతారు.

గరుడ పుష్పకవాహనం



రెండో రోజు 5వ తేదీ బుధవారం సాయంత్రం 4 గంటలకు స్వామివారు గరుడ పుష్పకవాహనంపై ఊరేగుతారు. గరుడు వేదమూర్తి స్వామివారి వాహనం నిత్యం స్వామి వారికి గరుడవాహనం ఎక్కి గ్రామోత్సవంలో పాల్గొంటారు.

పుష్పక వాహనం



రెండోరోజు బుధవారం రాత్రి 7గంటలకు స్వామివారు పుష్పక వాహనం అధిరోహిస్తారు. భక్తుల మనో రథాన్ని నెరవేర్చడం కోసం శ్రీ స్వామివారు తన హృదయమనే పుష్పంలో ఎంతమంది భక్తులు వచ్చినా చోటు కల్పిస్తానని చాటి చెప్పేందుకు ఈ వాహనంపై ఊరేగుతారు.



హంస వాహనం

మూడో రోజు 6వ తేదీ గురువారం సాయంత్రం 4 గంటలకు శ్రీ స్వామివారు హంస వాహనంపై ఊరేగింపుగా వెళ్తారు. పాలు, నీళ్లను వేరు చేసే శక్తి హంసకు మాత్రమే ఉంది.

శేష వాహనం



మూడోరోజు గురువారంరాత్రి 7 గంటలకు శేషవాహనంపై ఊరేగుతారు. శిష్యుడు వాక్షిమ కలిగిన వారు. సర్వ హక్కులకు అధినేత అయిన వాక్ బ్రహ్మను నేనే అని భక్తులకు తెలియజెప్పేందుకు ఆదిశేషుడిపై వేంచేస్తారు.

పంచముఖాంజనేయ వాహనం

నాల్గవరోజు 7వ తేదీ శుక్రవారం సాయంత్రం 4గంటలకు స్వామివారు అధిరోహించే వాహనం పంచ ముఖాంజనేయ. బుద్ధి, బలం, కీర్తి, ధైర్యం, భయం లేకు



ఒడుట అనే గుణాలను భక్తులకు పంచిపెట్టడం కోసం శ్రీవారు పంచముఖ ఆంజనేయ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు

కంచు గరుడ వాహనం



నాల్గవరోజు శుక్రవారంరాత్రి 8 గంటలకు కంచు గరుడవాహ నంపై అధిరోహించి భక్తులకు వినత, దాత్యమును పోగొట్టేందుకు తాను ప్రయత్నించి గరుడు సఫలీకృతమై శ్రీ స్వామివారి అనుగ్రహం పొందేందుకు పంచ గరుడ వాహనంపై గ్రామోత్సవానికి వెళతారు. అదేరోజు రాత్రి దశమి 12.55 గంటలకు మృగశిర నక్షత్రయుక్త వృశ్చిక లగ్నమందు స్వామివారి తిరు కళ్యాణం జరుగుతుంది. ఐదోరోజు 8వతేదీ శనివారం భీష్మఏకాదశి పర్వదినాన మధ్యాహ్నం 2.05 గంటలకు శ్రీస్వామివారి రథోత్సవం.

గజ వాహనం

ఆరోరోజు 9వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటల



కు స్వామివారు గజ వాహనాన్ని అధిరోహించి ఊరేగు తారు. గజం బుద్ధికి సంకేతం. తాను వేయాల్సిన ప్రతి అడుగు భాగుగా ఆలోచించి భక్తి, జ్ఞాన వైరాగ్యం వైపు భక్తులను నడిపించేందుకు శ్రీ లక్ష్మీనరాసింహస్వామి వారు గజ వాహనంపై ఊరేగింపునకు వెళ్తారు.

పొన్న వాహనం



ఆరో రోజు ఆదివారం రాత్రి 8 గంటలకు స్వామివారు పొన్న వాహనంపై గ్రామోత్సవానికి వెళతారు. నాది అనేద ఏదీ లేదని సర్వశ్వం నేనే అని గోపికలు కృష్ణ పదుమాత్మనికి ఆత్మ నివేదన చేసిన సమయంలో శ్రీ కృష్ణ పరమాత్మపై పొన్న చెట్టుపై కూర్చుని వారి నివేదనను స్వీకరిస్తారు.

హనుమత్ వాహనం

ఏడవ రోజు 10వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటలకు స్వామివారు హనుమత్ వాహనంపై



ఊరేగింపునకు వెళతారు. హనుమంతుడు కార్యం చేయాల్సి వచ్చినప్పుడు తన దైవాన్ని స్మరించుకు ని పూర్తి చేస్తాడు. హనుమంతుడు స్వామివారిని తన భుజాలపై అధిరోహింప చేసుకుని శ్రీలక్ష్మీ నరసింహరాముని తలచుకుని భక్తులు తలపెట్టిన పనులు నిర్విఘ్నంగా పూర్తి చేయవచ్చని హనుమత్‌వాహనంపై ఊరేగుతారు.

సింహ వాహనం




ఏడోరోజు సోమవారం రాత్రి 7గంటలకు సింహవాహనం అధిరోహిస్తారు. మానవుడు, మాధవుడు కలిసిన స్వరూపమే శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారు. అతి మాధవ స్వరూపం సింహం నేనేనని శ్రీకృష్ణపరమాత్ముడు చెప్పినట్టుగా లక్ష్మీనరసింహ స్వామి వారు సింహంపై అధిరోహిస్తారు.

రాజాధిరాజ వాహనం



ఎనిమిదో రోజు 11వ తేదీ మంగళవారం సాయంత్రం 4గంటలకు స్వామి వారు రాజాధిరాజా వాహ నంపై ఊరేగింపునకు వెళ్తా రు.

అశ్వవాహనం



ఎనిమిదోరోజు మంగళవారంరాత్రి 7 గంటలకు కేశవదాసుపాలెం వాస్తవ్యులు బెల్లంకొండ, ఉండపల్లి వారిచే నిర్మితమైన అశ్వవాహనాన్ని స్వామివారు అధిరోహిస్తారు. మనిషిలో ఉండే జ్ఞానం జడ పదార్థంగా ఉండకుండా గుర్రం వలే చురుకుదనం త్వరితతగతిన విచ్చేందుకు స్వామివారు అశ్వ వాహనంపై దర్శనమిస్తారు.

- తొమ్మిదో రోజు 12న బుధవారం మా ఘ పౌర్ణమినాడు ఉదయం 8గంటలకు గరుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం.
- పదోరోజు 13 సాయంత్రం 5 గంటలకు పుష్పక వాహనంపై స్వా మివారి గ్రామోత్సవం జరుగుతుంది.

కొంకాపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఐషర్‌వ్యాన్.. ఆటో ఢీ.. ఆరుగురికి తీవ్ర గాయాలు
- ఒక యువతి పరిస్థితి విషమం
- కిమ్స్ ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్న బాధితులు



తలకు తీవ్ర గాయమై రక్తపు మడుగులో పడి ఉన్న నలబ శ్రీదేవి



చికిత్స పొందుతున్న మానుపాటి దుర్గ, గాయపడ్డ వనుము కిశోర్

అమలాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): 216 జాతీయ రహదారిపై అమలాపురం పట్టణ శివారు కొంకాపల్లిలో గల ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు గాయపడ్డారు. వారిలో ఒక యువతి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఆటో, రొయ్యల ట్రాన్స్‌పోర్టుకు సంబంధించిన ఐషర్ వ్యాన్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అమలాపురం పట్టణంలోని మున్సిపల్ కాలనీకి చెందిన కొందరు ఆదివారం సెలవురోజు కావడంతో అల్లవరం మండలం ఓడలరేవు సముద్ర తీరానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘోర ప్రమాదం జరిగింది. డ్రైవర్‌తో సహా ఎనిమిది మంది ప్రయాణికులతో అమలాపురం వైపు వస్తున్న ఆటోను భీమవరంవైపు వెళుతున్న రొయ్యల కంపెనీకి చెందిన ఐషర్ వ్యాన్ వేగంగా వచ్చి ఢీకొంది. దాంతో ఆటోలో ఉన్న ఎనిమిది మందిలో ఏడుగురికి గాయాలు కాగా ఒక బాలిక మాత్రం సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడింది.

ఆటో ముందు, పక్కభాగం నుజ్జునుజ్జయింది. ప్రమాదం జరిగిన వెంటనే వ్యాన్ డ్రైవర్ వాహనాన్ని వదిలి పరారయ్యాడు. అయితే సంఘటనా స్థలివద్ద గాయపడ్డ వారి ఆర్తనాదాలు చూపరులను కలచివేశాయి. రక్తపు మడుగులో ఉన్న బాధితులను స్థానికుల సహకారంతో 108 అంబులెన్సు వాహనంలో తొలుత అమలాపురంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యసేవల కోసం బాధితులను కిమ్స్ మెడికల్ కళాశాల ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన బాధితుల్లో అమలాపురం రూరల్ మండలం ఎ.వేమవరం గ్రామానికి చెందిన నలబ శ్రీదేవి (16) పరిస్థితి విషమంగా ఉంది. తలకు బలమైన గాయం కావడంతో రక్తస్రావం జరగడంతో అపస్మారక స్థితిలో ఉన్న ఆమెకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. మిగిలిన వారి వివరాలు ఇలా.. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు మానుపాటి నాగేంద్ర (38), మానుపాటి దుర్గ (35), వనుము కిశోర్ (16), మానుపాటి నాని (14), మానుపాటి దివ్య (6), వనుము కిరణ్ (12), ఆటోడ్రైవర్ మొగిలి మహేష్ (20) తీవ్రంగా గాయపడ్డారు. కాళ్లు, చేతులు విరిగిపోవడం, తలకు గాయం కావడం వంటి సమస్యలతో బాధితులు కిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే పట్టణ సీఐ పి.వీరబాబు, ఎస్ఐలు ఘటనాస్థలాన్ని సందర్శించి కేసు విచారణ చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వీరబాబు తెలిపారు. ఓడలరేవులో సరదాగా గడిపి మరికొన్ని క్షణాల్లో ఇంటికి చేరకుంటామన్న తరుణంలో ఈప్రమాదం జరగడంతో బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వీరంతా ఎస్టీ సామాజికవర్గానికి చెందినవారు.

పిఠాపురంలో అంతర జిల్లా నేరస్తుడి అరెస్టు

- 48 మోటార్‌సైకిళ్లు స్వాధీనం
- కాకినాడ, అనకాపల్లి జిల్లాల కేసుల్లో అరెస్టు
- అదుపులో ఆరుగురు కొనుగోలుదారులు
- వెల్డింగ్ పని చేస్తూ వ్యసనాలకులోనై చోరీలు
- వెల్లడించిన కాకినాడ ఎస్పీ బిందుమాధవ్



పిఠాపురంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటార్‌సైకిళ్లు, అంతరజిల్లా నేరస్తుడిని అరెస్టు చూపుతున్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్

పిఠాపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతరజిల్లా నేరస్తుడిని పిఠాపురం పోలీసులు అరెస్టుచేసి 48 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మోటార్‌సైకిళ్లను కొనుగోలు చేస్తు న్న ఆరుగురుని ముద్దాయిలుగా చేర్చి వారిని అదుపులోకి తీసుకున్నారు. పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ బిందుమాధవ్ వెల్లడించారు. కాకినాడ జిల్లాలోని పిఠాపురం పట్టణం, రూరల్, కొత్తపల్లి, గొల్లప్రోలు, సర్పవరం, తునిటౌన్, తొండంగి, అన్నవరం పోలీసుస్టేషన్లు, అనకాపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 48కిపైగా మోటార్‌సైకిళ్లు చోరీకి గురయ్యాయి. చోరీలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ బిందుమాధవ్, కాకినాడ ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ ఆదేశాలతో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, ఎస్ఐలు, క్రైమ్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టారు. ఇతను మంకీకేప్, మాస్క్ ధరించి ముఖం కనబడకుండా కొంతకాలంగా బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న సంఘటనలు జరగడంతో ఈ కేసులను పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సంక్రాంతి రోజున జరిగిన బైక్ చోరీ సంఘటనలో సీసీ కెమెరాలు, ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి పిఠాపురం పట్టణం అగ్రహారం ప్రాంతానికి చెందిన సొంటిని గంగాధర్ అలియాస్ రీసు గంగాధర్‌ను అరెస్టుచేశారు. విచారించగా ఇతను రెండేళ్ల కాలంలో తొమ్మిది పోలీసుస్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. 48 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇతను గతంలో కూడా చోరీలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. పిఠాపురం పట్టణంలో నమో దైన 15 కేసుల్లో ఇతనిని అరెస్టు చూపించారు. ఇతని వద్ద నుంచి మోటార్‌సైకిళ్లు కొనుగోలుచేసి ఇతరులకు విక్రయిస్తున్న ఆరుగురుని గుర్తించి వారిని ముద్దాయిలుగా చేర్చి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని ప్రస్తుతం విచారిస్తున్నారు. గంగాధర్ వెల్డింగ్ పనిచేస్తూ జీవనం సాగించే వాడు. వ్యసనాలకు లోనై కొంతకాలంగా చోరీలకు అలవాటు పడినట్లు చెబుతున్నారు. ఇతనికి ఎవరైనా సహకరించారా అనే అంశంపై పోలీసులు విచారణ సాగిస్తున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. కేసును పకడ్బందీగా విచారించి నిం దితుడిని అరెస్టు చేసి భారీగా మోటార్‌సైకిళ్లు స్వాధీనం చేసుకున్న సీఐ, ఎస్ఐలు, పోలీసు సిబ్బందిని ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, పట్టణ ఎస్ఐలు మణికుమార్, జానీభాషా పాల్గొన్నారు.

పరిచయం పెంచుకుని బైక్‌లు అమ్మాడు

మోటార్‌సైకిళ్లకు చోరీకి పాల్పడిన గంగాధర్ ప్రత్తిపాడు, శంఖవరం మండలాల్లో దొంగలించిన బైక్‌లు కొని అమ్మేవారితో 2023 నుంచి పరిచయాలు పెంచుకున్నాడు. పెళ్లయిన తర్వాత చెడు అలవాట్లకు లోనయిన గంగాధర్ నకిలీ తాళాలు ఉపయోగించి మోటార్ సైకిళ్లను చోరీ చేసేవాడు. ఈవిధంగా చోరీ చేసిన బైక్‌లను రెండు మండలాలుకు చెందిన కార్తిక సత్తిబాబు, కురుమళ్ల వీరబాబు, గనాసుల ఆనంద్, తోట లక్ష్మణరావు, ఏనుగపల్లి నాగ సత్యనారాయణ, వట్టికోళ్ల చక్రయ్యలకు ఒక్కొక్క బైక్‌ను రూ.10వేలు వంతున విక్రయించే వాడు. వచ్చిన సొమ్మును జల్సాలుకు వినియోగించే వాడు. ఈఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు అదుపులోకి తీసుకున్నారు

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



నిమ్మన శివనాగకృష్ణ (ఫైల్)

ముమ్మిడివరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యం కేసులో పోలీసులు వేధింపులకు గురి చేయడంతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ముమ్మిడివరం మండలం గేదెల్లంకలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముమ్మిడివరం మండలం గేదెల్లంకకు చెందిన నిమ్మన శివనాగకృష్ణ (32) భార్య సాయిరేవతి, తల్లిదండ్రులు వెంకటరమణ-శేషగిరిరావుతో కలిసి హైదరాబాద్ ఎల్బీనగర్ మనుసూరాబాద్‌లో పండ్లు, జ్యూస్ వ్యాపారంపెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. అక్కడ ఓ వివాహిత అదృశ్యం కావడం.. ఆమె భర్త పోలీసు శాఖలో పనిచేయడంతో.. శివనాగకృష్ణ ప్రమేయం ఉందని పోలీసులు వేధించడంతో మనస్తాపం, భయాందోళన చెంది శివనాగకృష్ణ హైదరాబాద్ నుంచి శనివారం స్వగ్రామం గేదెల్లంక వచ్చాడు. శివనాగకృష్ణ శనివారం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతో అతడిని బంధువులు మురమళ్ల ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. శివనాగకృష్ణ సుమారు 15 ఏళ్లుగా తల్లిదండ్రులతో కలిసి హైదరాబాద్ ఎల్బీనగర్ మనుసూరాబాద్‌లో పండ్లు, జ్యూస్‌లషాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. 11 నెలల క్రితం సాయిరేవతితో వివాహమైంది. పెళ్లి అయిన తరువాత భార్యను కూడా హైదరాబాద్ తీసుకువెళ్లాడు. ఇటీవల అక్కడ పోలీసుశాఖలో పనిచేస్తున్న ఉద్యోగి భార్య అదృశ్యం వెనుక శివనాగకృష్ణ ప్రమేయం ఉందని పోలీసులు వేధించడంతో మనస్తాపం, ఆందోళన చెందిన శివనాగకృష్ణ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని బంధువులు చెబుతున్నారు. ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నవోదయలో 9,11 తరగతిలో ప్రవేశానికి పరీక్ష

పెద్దాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయలో 9,11 తరగతిలో ప్రవేశానికి ఈనెల 8న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు నవోదయ ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య తెలిపారు. ఈప్రవేశ పరీక్ష పెద్దాపురంలో 9 సెంటర్లలో జరుగుతుందన్నారు. తొమ్మిదో తరగతికి 1451మంది, 11వ తరగతికి 699 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు.

గ్లకోమాను సకాలంలో గుర్తించాలి

- జీఎస్ఎల్‌లో అంతర్జాతీయ సదస్సులో వక్తలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్య నిపుణులు

రాజానగరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్లకోమా అంతర్జాతీయ సదస్సును గౌతమి ఐ ఇన్‌స్టిట్యూట్, ఐ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా సహకారంతో ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా గౌతమి ఐ ఇన్‌స్టిట్యూట్, ఐ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా జాన్స్ హాప్ కిన్స్ యూనివర్శిటీ (యుఎస్ఏ)కి చెందిన డాక్టర్ థామస్ వి.జాన్సన్ ధనవంత్రి గురించి వివరించారు. గ్లకోమాలో న్యూరోప్రొటెక్షన్, గ్లకోమాకు సంబంధించిన సమస్యలను వివరించారు. గ్లకోమా, రెటీనీ కణాల మార్పిడి గురించి తెలియజేశారు. కార్నెల్ మెడ్ సెంటర్ న్యూయార్క్‌కు చెందిన డాక్టర్ చార్లెస్ కోల్ సుశ్రుత కీలకోపా న్యాసం చేశారు. గ్లకోమా కోసం శస్త్రచికిత్స సమయాల్లో తీసుకునే సాహసాల, విధానాలపై వివరించారు. గౌతమి ఐ ఇన్‌స్టిట్యూట్‌కి చెందిన డాక్టర్ ఎ.ప్రశాంత్ కుమార్, సీనియర్ వైద్య నిపుణులు గ్లకోమా రోగులకు లేజర్ చికిత్స, విధి విధా నాలపై ప్రదర్శన ద్వారా వివరించారు. బాలల అంధత్వాన్ని నిర్మూలించడం కోసం ప్రత్యేకంగా అందిస్తున్న సేవలను యుఎస్ నుంచి విచ్చేసిన పారిశ్రామిక వేత్త, వైద్య నిపుణుడు డాక్టర్ శ్రీను మద్దుల కార్నియా స్పెషలిస్ట్ గౌతమి ఐ ఇన్‌స్టి ట్యూట్ చైర్మన్ డాక్టర్ వీకె రాజును ప్రశంసించారు. అమెరికాకు చెందిన డాక్టర్ లీలారాజు ముఖ్యఅతిథులను పరిచయం చేస్తూ సదస్సు ప్రాధాన్యతను వివరించారు. పలు విద్యాసంస్థలకు చెందిన ఆప్తమాలిక్ మెడికోలు, విద్యార్థులకు కంటి వ్యాధులపై ప్రదర్శనలు ద్వారా వివరించారు. అనంత రం గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ చాన్సలర్ కేవీవీ సత్య నారాయణరాజు (చైతన్యరాజు)ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గురునాథ్, గౌతమి మేనేజర్ డైరెక్టర్ వీవీ కుమార్, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, నయన కంటి ఆసుపత్రి వైద్యుడు శ్రీరాం, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ డాక్టర్ ప్రజ్ఞ పరిశీలకులుగా వ్య వహరించారు.


నల్లకుంటలో మూడిళ్లు బుగ్గి

- రూ.15 లక్షలు ఆస్తి నష్టం

ఎటపాక, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం నల్లకుంటలో ఆదివారం సాయంత్రం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మూడు తాటాకిళ్లు బుగ్గి అయ్యాయి. రూ.15లక్షల ఆస్తి నష్టం జరిగిందని రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో తొలుత ఊయిక వీరమయ్య ఇంటికి నిప్పంటుకుంది. ఆమంటలు దావానంలా వ్యాపించి పక్కనే ఉన్న తెల్లం రాములమ్మ ఇంటికి నిప్పంటుకుంది. ఆపైన కలముల ధనలక్ష్మి ఇంటికి మంటలు వ్యాపించాయి. ప్రమాదాన్ని గుర్తించిన బాలింత ధనలక్ష్మి కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చారు. ఆలోపే ఇళ్లన్నీ కాలిపోయాయి. రాములమ్మ ఇంట్లోని మూడు కాసుల బంగారంతో పాటు ధాన్యం బస్తాలు, గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఊయిక వీరమయ్య ఇంట్లో బీరువాలో ఉంచిన రూ.1.50లక్షల నగదుతో పాటు బంగారం, ధాన్యం,పట్టాదారుపాస్‌పుస్తకాలు, గృహో పకరణాలు కాలిపోయాయి. ధనలక్ష్మి ఇంటి బీరువాలోని బంగారు తాడు, గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. వీఆర్వో కన్నమ్మ నష్టాన్ని అంచనా వేసి పంచనామా నిర్వహించారు. ఈ ప్రమాదంతో మూడు కుటుంబాలకు చెందిన గిరిజనులు కట్టుబట్టలతో మిగిలారు.

మాజీ మంత్రి ముద్రగడ ఇంటి వద్ద ఉద్రిక్తత

- ఇంటి గేటును ఢీకొట్టిన మతిస్థిమితం లేని వ్యక్తి
- అదుపులోకి తీసుకున్న పోలీసులు



దాడికి కారణమైన యువకుడు

కిర్లంపూడి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభరెడ్డి నివాసంలో ఆదివారం తెల్లవారుజామున నాలుగుగంటల సమయంలో ఒక యువకుడు బీభత్సం సృష్టించాడు. ర్యాంపుపై ఉన్న కారును ట్రాక్టర్‌తో ధ్వంసం చేశాడు. ఈ అలజడికి ఇంట్లో నుంచి ముద్రగడ కుటుంబీకులు బయటకు వచ్చారు. అక్కడున్న వారు అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. యువకుడిని మండలం జగపతినగరం గ్రామానికి చెందిన గనిశెట్టి గంగాధర్‌గా గుర్తించారు. విషయం తెలుసుకున్న జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ సిబ్బందితో ముద్రగడ నివాసానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. కిర్లంపూడి ఎస్ఐ సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు వచ్చి ముద్రగడను కలిశారు. మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, దాడిశెట్టి రాజా, తోట నరసింహం, చెల్లుబోయిన వేణు, మాజీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ వంగా గీత ముద్రగడ పద్మనాభం, గిరిబాబులను కలిసి ఏం జరిగిందని ఆరా తీశారు.

అయ్యప్ప ఆలయ అభివృద్ధికి సహకరిస్తా

మలికిపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మలికిపురంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీఅయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి, రక్షణగోడ సహకరించాలని ఆలయ కమిటీ ఎమ్మెల్యేను కోరింది. ఆదివారం ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యేను సన్మానించారు.

ఆలయంలో పూజలు

అంబాజీపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వసంతపంచమి, రథసప్తమి పూజలు ఆదివారం నిర్వహించారు. అర్చకులు చంద్రమౌళి ధనుష్‌శర్మ ఆధ్వర్యంలో సూర్యభగవానుడికి మూడు రోజులు పూజలు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం సభ్యులు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి నాయకులు చురుగ్గా పనిచేయాలి

ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు



ఐ.పోలవరం: సమావేశంలో మాట్లాడుతున్న ముమ్మిడివరం ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కష్టించి పనిచేయాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పిలుపు ఇచ్చారు. మురమళ్ల క్యాంపు కార్యాలయంలో ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు అధ్యక్షతన పార్టీ సమావేశం జరిగింది. సమావేశానికి ఎన్నికల పరిశీలకుడు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోనంకి కృష్ణంనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కూటమి నాయకులందరూ రాజశేఖర్ విజయానికి కృషి చేసి అత్యధిక మెజారిటీ వచ్చేలా చూడాలన్నారు. సమావేశంలో గుత్తుల సాయి, కాకర్లపూడి రాజేష్, సాగిరాజు సూరిబాబురాజు, సాకా సీతాదేవి, గంజా సుధాకర్, సాగిరాజు వాసురాజు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి దుర్గారావు, పెంట రవి తదితరులు తదితరులు పాల్గొన్నారు.

దళితులు క్రియాశీలకంగా వ్యవహరించాలి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా శాఖ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు (బాలు) పిలుపునిచ్చారు. రాజశేఖర్‌ను ఎమ్మెల్సీగా గెలిపించడంతో దళితులు క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. అమలాపురం ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎస్సీసెల్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం బాలు అధ్యక్షతన జరిగింది. టీడీపీ హయాంలోనే దళితుల అభివృద్ధి జరిగిందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చుట్టుగుళ్ల కిశోర్, హెచ్‌ఆర్డీ సభ్యుడు నేదునూరి వీర్రాజు, అధికార ప్రతినిధి మోర్త వెంకటేశ్వరరావు, పి.గన్నవరం నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు బడుగు భాస్కర్‌జోగేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు గెల్లా అశోక్, పల్లి ఏసు తదితరులు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

ఓటర్లను అభ్యర్థించాలి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రోనంకి కృష్ణమనాయుడు పిలుపునిచ్చారు. ముమ్మిడివరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు అర్థాని శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతీ వార్డు ఇన్‌చార్జిలు బాధ్యతలు అప్పగించిన నాయకులతో కలిసివెళ్లి ఓటర్లను అభ్యర్థించాలన్నారు. పేరాబత్తుల రాజశేఖర్‌కు ఓటువేసి ఎన్నికల్లో గెలిపించాలని ఓటరును అభ్యర్థించాలన్నారు. ఎన్నికలకు సంబంధించి పార్టీ నాయకులు, కార్యకర్తలకు కొన్ని సూచనలిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, మాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చెల్లి అశోక్, నాయకులు గొలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, దొమ్మేటి రమణకుమార్, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి దుర్గారావు, ఆర్.గణపతిరావు, రాష్ట్ర యువత నాయకులు గుద్దటి జమి, దూడల స్వామినాయుడు, గొల్లపల్లి ధర్మారావు, పిల్లి నాగరాజు, చిక్కాల అంజిబాబు, విళ్ల వీరాస్వామి నాయుడు, గొల్లపల్లి గోపి, యాళ్ల ఉదయ్, నిమ్మకాయల విస్సు, దంగేటి శ్రీను, కుంచే శ్రీను, వాసంశెట్టి అమ్మాజీ, బొక్కా రుక్మిణి, సత్తి నూకరాజు, సరిపెల్ల శ్రీనురాజు, రెడ్డి శ్రీను, కురసాల శివబాబు, సానబోయిన సోమయ్య, బొక్కా సత్యనారాయణ, రెడ్డి శ్రీను పాల్గొన్నారు.

దేవాలయ ఆస్తులను ప్రభుత్వం రక్షించాలి

రాష్ట్ర మహిళా ప్రముఖ్ సునీత



విశ్వహిందూ పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా ప్రముఖ్ సునీత

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): దేవాలయాల ఆస్తులు ఆక్రమణలకు గురికాకుండా ప్రభుత్వం రక్షించాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర మహిళా ప్రముఖ్ సునీత అన్నారు. విజయవాడలో నిర్వహించిన హైందవ శంఖారావ సమ్మేళనం విజయవంతమైందని, అదే తరహాలో మార్చి నెలాఖరు నాటికి ప్రతీ మండల స్థాయిలోను నిర్వహించనున్నట్టు ప్రకటించారు. వీహెచ్‌పీ జిల్లాశాఖ అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో హైందవ శంఖారావం విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అంతర్వేది కల్యాణోత్సవాల్లో భక్తులకు పూర్తిస్థాయిలో ఉచిత దర్శనభాగ్యం కల్పించాలన్నారు. సంస్థాగతంగా విశ్వహిందూ పరిషత్ క్షేత్ర స్థాయిలో బలపడేందుకు వేసవి సెలవుల్లో యువతకు వారం రోజుల పాటు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. దేశభక్తి, జాతీయభావం, క్రమశిక్షణ, యోగా, సూర్య నమస్కారాలు, వ్యాయామం, ఆత్మరక్షణ విద్యలు, నిజమైన దేశభక్తుల చరిత్రపై అవగాహన కల్పిస్తామని వివరించారు. జిల్లా కార్యదర్శి ప్రయాగ నరసింహమూర్తి, భజరంగ్‌దళ్ రాష్ట్ర ప్రముఖ్ శిరంగు నాయుడు, విభాగ్ కార్యదర్శి గంధం గోవిందు, దుర్గావాహిని ప్రముఖ్ గుత్తుల సుగుణ, నంద్యాల సీతారామ్, ఊటుకూరి సాంబయ్య, వేణుగోపాల్, యక్కల బ్రహ్మేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది ఉత్సవ ఏర్పాట్లు పరిశీలించిన డీఎస్పీ



క్యూలైన్లను పరిశీలిస్తున్న కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్

అంతర్వేది, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దివ్య తిరు కల్యాణోత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ తెలిపారు. కొత్తపేట నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన ఆదివారం అంతర్వేది స్వామివారి ఆలయానికి విచ్చేశారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు మహదాశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, సీఐ నరేష్‌కుమార్‌తో కలిసి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. కల్యాణ మండపం, మ్యాప్‌ను పరిశీలించారు. సామాన్య భక్తులు కూడా కల్యాణం తిలకించి స్వామి దర్శనం చేసుకునే విధంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తామన్నారు. అనంతరం క్యూలైన్లు, రథం రూట్, వన్‌వే రూట్, స్నానఘట్టాలు, కమాండ్ కంట్రోల్ రూమ్, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు.

నేటి నుంచి సత్తెమ్మ జాతర ఉత్సవాలు



ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి-సన్నవిల్లి ఓఎన్జీసీ సెంటర్‌లో కొలువై ఉన్న గ్రామదేవత సత్తెమ్మతల్లి జాతర మహోత్సవాలు ఈనెల3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశారు. మొదటి రోజు పుల్లేటికుర్తి గౌరీశంకర్ ఆధ్వర్యంలో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు జరుగుతాయని ఉత్సవ కమిటీ తెలిపింది. రెండో రోజు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మూడో రోజు గరగ నృత్యాలు, బ్యాండు మేళాలతో అమ్మవారి జాతర వైభవంగా నిర్వహిస్తారు. అమ్మవారి తీర్థం జరుగుతుంది. అదే రోజు భారీ అన్నసమారాధనకు ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. పాలకొల్లుకు చెందిన పోశెట్టి వెంకటసూర్యనారాయణ, లక్ష్మీసత్యశ్రీ దంపతుల ఆధ్వర్యంలో ఆలయానికి పూల అలంకరణ చేశారు.

ఏకాదశ రుద్రుల చరిత్రపై ఆలయాల్లో వీణ కచేరి



గంగలకుర్రు అగ్రహారంలో వీణ కచేరి నిర్వహిస్తున్న నాగలక్ష్మి

అంబాజీపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి చెందిన జగన్నతోట ఏకాదశ రుద్రుల చరిత్ర తెలుసుకుని ఆయా ఆలయాల్లో వీణ కచేరి చేస్తున్నట్లు నెల్లూరుకు చెందిన ప్రముఖ సంగీత విద్యాంసురాలు శ్రీకంఠం నాగలక్ష్మి అన్నారు. గంగలకుర్రు అగ్రహారం, గంగలకుర్రులోని వీరేశ్వరస్వామి, చెన్నమల్లేశ్వరస్వామి ఆలయాల్లో ఆదివారం వీణ కచేరి జరిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను శ్రీహరికోటలో ఉద్యోగం చేశానని, సంగీతంపై మక్కువతో ఉద్యోగానికి రాజీనామా చేసి వీణసాదన చేశానన్నారు. తన భర్త మాధవరావు స్ఫూర్తితో తిరుపతి, వారణాశి, తిరువనంతపురం, శ్రీశైలం తదితర ప్రసిద్ధి ఆలయాల్లో వీణ కచేరి చేశానన్నారు. ఏకాదశ రుద్రుల ఖ్యాతిని తెలుసుకుని 11 ఆలయాల్లో వీణ కచేరి చేశానన్నారు. ఏకాదశ రుద్రులను దర్శించుకుని ఆయా ఆలయాల్లో వీణకచేరి చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం శివకేశవ యూత్, గ్రామస్తుల ఆధ్వర్యంలో నాగ లక్ష్మిని సత్కరించారు.

ఉపాధ్యాయులకు బెస్ట్ సర్వీసెస్ అవార్డులు



అవార్డులు అందుకుంటున్న బాలకృష్ణ, నాగేంద్రరాజు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల్లో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను అభినందిస్తూ జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి కలెక్టరేట్‌లో బెస్ట్ సర్వీసెస్ అవార్డులను అందజేశారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు కుంచే బాలకృష్ణ, జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడు డి.నాగేంద్రరాజు, తొండవరం పాఠశాల ఉపాధ్యాయుడు సాల్మన్‌రాజుకు జేసీ బెస్ట్ సర్వీసెస్ అవార్డులను అందించారు. కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన అధికారులను జేసీతో పాటు జిల్లావిద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం అభినందించారు.

అధ్వానంగా రహదారి.. ప్రజల అవస్థలు



చప్పిడివారిపాలెంలో ప్రమాదభరితంగా ఉన్న సిమెంట్ తూర

అంబాజీపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నిత్యం వందలాది మంది ప్రయాణించే రహదారి అధ్వానంగా మారింది. మాచవరం పంచాయతీ పరిధిలోని బేతాళస్వామి ఆలయం నుంచి పోతాయిలంక వెళ్లే రహదారి రెండు కిలో మీటర్లు మేర గోతులమయంగా మారింది. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఈరహదారిలో బేతాళస్వామి ఆలయం నుంచి చప్పిడివారిపాలెం, కోఠివారి అగ్రహారం, కుమ్మరివారిపాలెం, పోతాయిలంక వాసులు ఈ రహదారిలో ప్రయాణిస్తుంటారు. రోడ్డు గోతులుమయంగా మారడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాకాలంలో బురదమయంగా మారి విద్యార్థులు, రైతులు నానా అవస్థలు పడుతున్నారు. చప్పిడివారిపాలెంలోని షిర్డిసాయిబాబా ఆల యం వద్ద సిమెంట్ తూర విరిగిపోవడంతో ప్రమాదభరితంగా మారింది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారి నిర్మించాలని కోరుతున్నారు.

పంటబోదెలో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించండి

రైతుల వేడుకోలు



కత్తులవారిపేట వద్ద పంటబోదెలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

పి.గన్నవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పంట బోదెలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించండి మహాప్రభో అంటూ రైతులు మొరపెట్టుకుంటున్నారు. పి.గన్నవరం శివారు కత్తులవారిపేట గ్రామం సమీపంలో ఉన్న జమీందారి పంటబోదేలో ప్లాస్టిక్ వ్యర్థాలు భారీగా పేరుకుపోయి సాగునీరు ముందుకు రావడంలేదని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట చేల్లోకి దిగడానికి సైతం ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ఉపాధిహామీ పథకం పనుల్లో భాగంగా సమీపంలోని బోదెలను శుభ్రంచేశారని, ఈపంట బోదెను అధికారులు కనీసం పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పంట బోదెలో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించాలని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు.

నేడు శెట్టిబలిజనేత దొమ్మేటి అంత్యక్రియలు

అల్లవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బోడసకుర్రు మాజీ సర్పంచ్, తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణాజిల్లాల శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు దొమ్మేటి బాబూరావు అంత్యక్రియలు అల్లవరం మండలం బోడసకుర్రులో సోమవారం నిర్వహిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. బోడసకుర్రు వైనతేయ గోదావరి తీరాన దొమ్మేటి బాబూరావు అంత్యక్రియలు జరుగుతాయని అన్నారు. దొమ్మేటి బాబూరావు మృతిపట్ల ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ తదితరులు సంతాపం తెలిపారు.

విద్యుత్ ప్రమాద బాధితులకు రూ.3లక్షల సాయం



సాయం అందజేస్తున్న శెట్టిబలిజ సంఘ ప్రముఖులు

అల్లవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గోడి కొత్తకాలనీలో భవనంపై ఆడుకుంటూ విద్యుత్ ప్రమాదంలో చేయి కోల్పోయిన చిన్నారి కేతా లాస్యమాధురి, గాయపడ్డ ఆమె తల్లికి శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ రూ.3లక్షల ఆర్థికసాయం అందజేసింది. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారి కేతా లాస్యమాధురి, ఆమె తల్లిని శెట్టిబలిజ ప్రముఖులు పరామర్శించారు. అమలాపురం, ముమ్మిడివరం, శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్, హైదరాబాద్ స్మైలీ ఫౌండేషన్ రూ.3లక్షల ఆర్థిక సాయాన్ని ఆ పేద కుటుంబానికి సమకూర్చారు. చెల్లుబోయిన శ్రీనివాస్, ధనుష్, హనీష్, గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము, ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, బొక్కా శ్రీనివాసరావు తదితరులు బాధితులను పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు.

చికిత్స పొందుతూ మృతి



ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గత నెల 31న చల్లపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుంచే అనీల్‌కుమార్ (26) ఆదివారం మృతి చెందాడు. కుమార్ చికిత్స కోసం అధికారులు, స్థానికులు ఆర్థిక సహాయం అందించి ప్రాణ రక్షణ కోసం ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయిందని జనసేన నాయకుడు ఇసుకపట్ల రఘుబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

కనకదుర్గమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



అల్లవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అల్లవరంలో పునర్నిర్మించిన కనక దుర్గమ్మ వారి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వేడుకగా జరిగింది. విగ్రహ దాత కంకిపాటి గోపాలకృష్ణ-సువర్ణదుర్గాప్రసన్న దంపతులు కర్తలుగా పోచినపెద్ది మురళీప్రసాద్, పెద్దింటి వెంకటకృష్ణశాస్త్రి బ్రహ్మత్వాన వేదపండితులు గణపతి పూజ, హోమాలు, మహాపూర్ణాహుతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనకదుర్గమ్మ వారి దర్శనానికి అన్నసమారాధనకు భక్తులు పోటెత్తారు. బండిగుప్పాపు రంగ, ఆచంట రవి, కాకిలేటి సాయి, బండి గుప్పాపు సత్తిబాబు, కంకిపాటి వీరబాబు, బండిగుప్పాపు చిట్టివెంకన్న, కల్వకొలను తాతాజీ, అల్లవరం పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు.

ముత్తాబత్తులవారి ఆత్మీయ కలయిక



పేరూరులో ఆత్మీయ కలయిక

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ముత్తాబత్తుల వారి ఆత్మీయ కలయిక మొదటి వార్షికోత్సవం ఆదివారం పేరూరులో నిర్వహించారు. జిల్లాలోని ముత్తాబత్తులవారి కుటుంబ పెద్దలు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులైన ముత్తాబత్తుల వెంకట్రావు, ముత్తాబత్తుల ఏడుకొండలు, ముత్తాబత్తుల వెంకటేశ్వరరావు, రత్నకుమార్, ఆనందరావు తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి కుటుంబ సమేతంగా సభ్యులు హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందోత్సాహాలతో గడిపారు. ధనిక, పేద తారతమ్యం లేకుండా మనమంతా ఒక్కటే అన్న నినాదంతో ఒకే కుటుంబంగా ముందుకు సాగాలని ముత్తాబత్తుల శ్రీమాన్‌రాజు, ముత్తాబత్తుల రమణ, నాగేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ముత్తాబత్తుల వారి కుటుంబాల్లో ఎవరికైనా అనారోగ్యం చేస్తే వారిని ఆదుకునే విధంగా ఉచిత వైద్యసేవలు అందించేందుకు నిర్ణయించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు ముత్తాబత్తుల వీరవెంకటసత్యనారాయణ, ముత్తాబత్తుల భానుమతి, నాగేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

బెల్టుషాపులకు రూ.లక్షల్లో వేలం పాటలు

అల్లవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సముద్ర తీర ప్రాంతాలతో పాటు మత్స్యకార గ్రామాల్లో అనధికార మద్యం బెల్టుషాపుల నిర్వహణకు రూ.లక్షల్లో వేలం పాటలు జరిగాయి. ఓడలరేవు ఏటిమొగలో మద్యం బెల్టు షాపునకు శనివారం రాత్రి రూ.2లక్షలకు వేలం పాట జరిగింది. రెబ్బనపల్లిలో మద్యం బెల్టుషాపుకు రూ2లక్షలు, కొమరగిరిపట్నం శివారు ఎస్.రామేశ్వరంలో మద్యం బెల్టు షాపునకు రూ.4.50లక్షలకు వేలం పాటలు జరిగాయి. మండలంలోని 21గ్రామాల్లో 160కుపైగా మద్యం బెల్టు షాపుల ద్వారా జోరుగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. వీటితో పాటు తీర గ్రామాల్లో యానాం నుంచి నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం, సారా సరఫరా జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఓడలరేవు, కొమరగిరిపట్నం, తీర గ్రామాల్లో దొంగచాటుగా గంజాయి అమ్మకాలు సాగిస్తున్నారు. మద్యం బెల్టుషాపుల అమ్మకాలపై ఎక్సైజ్, పోలీసు శాఖలు ఎటువంటి దాడులు చేయడంలేదని మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయి.

విశ్వకర్మయోజన శిక్షణా తరగతులు నిర్వహించాలి

అమలాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి విశ్వకర్మయోజన శిక్షణా తరగతులను జిల్లాలోని ముఖ్య ప్రాంతాల్లో నిర్వహించాలని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి విజ్ఞప్తిచేశారు. అమలాపురం పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్వకర్మయోజన పథకంలోఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వివిధ చేతివృత్తులకు చెందిన వారికి సొంత జిల్లాల్లోనే శిక్షణ తరగతులు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్కిల్‌డెవలెప్‌మెంట్ అధికారులతో శిక్షణ ఇప్పించేలా కలెక్టర్ చొరవచూపాలన్నారు. ముస్కూరి ఏసుబాబు, తవిటికి అరుణ్‌కుమార్, కొనుకు వెంకటేశ్వరరావు, పితానిబేబీరావు, సత్తాల దుర్గారావు, కముజు సుందరరావు, పెదపూడి కృష్ణ, కూనవరపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

మామిడికుదురు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులో కోనసీమ బ్లడ్ డోనర్స్ స్వచ్ఛంద సేవాసంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో జరిగిన శిబిరంలో 60మంది రక్త దానం చేశారు. ఈరక్తాన్ని తలసేమియా, రక్తహీనత కలిగినచిన్న పిల్లలు, గర్భిణులు, ప్రమాదాల బారిన పడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ఎంతగానో ఉపయోగపడుతుందని సేవాసంస్థ అధ్యక్షుడు కాండ్రేగుల నరేంద్ర తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు చిట్టూరి జైకుమార్, నాగాబత్తుల ధర్మతేజ, కంచి ప్రశాంత్, చెల్లింగి కార్తీక్‌సాయి పాల్గొన్నారు.

ఘనంగా నాగప్రతిష్ఠ పూజలు

మామిడికుదురు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పాశర్లపూడిలో వేంచేసి ఉన్న వల్లీదేవసేన సమేత నాగేంద్రస్వామి ఆలయం వద్ద నాగప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్త దంపతులు నాగప్రతిష్ఠలో పాల్గొని పూజలు చేశారు. పూజలు నిర్వహించడం వల్ల కుటుంబ వృద్ధితో పాటు సంతానం కలుగుతుందని పలువురు దంపతులు, వివాహం కోసం యువతీయువకులు ఈపూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో నాగదేవతల ప్రతిమలకు పూజలు నిర్వహించి తరువాత వాటిని ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠింప చేశారు. ఈసందర్భంగా నాగేంద్రస్వామికి పలు పూజా కార్యక్రమాలను ఘనంగా చేశారు. ఈకార్యక్రమాలన్నీ వేదపండితుడు ఆదిరాజు నరసింహమూర్తి, ఆలయ అర్చకుడు గంటి బాలసుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

మామిడికుదురు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒక గ్రామంలో బాలిక అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్టు నగరం ఎస్‌ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపారు. మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలిక పెదపట్నంలంక జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. తన స్నేహితురాలి వద్ద నుంచి బంగారు గొలుసు తీసుకుని దాన్ని మరొక స్నేహితురాలికి ఇచ్చినట్టు తల్లికి చెప్పింది. తన గొలుసు ఇవ్వమని స్నేహితురాలు తండ్రితో వచ్చి ఆ బాలికను అడగ్గా, ఇచ్చేసినట్టు వారికి బాలిక చెప్పింది. సోమవారం నాటికి తన గొలుసు ఇచ్చేయాలని స్నేహితురాలు చెప్పింది. దీంతో శనివారం సాయంత్రం బాలికను తల్లి మందలించింది. ఇది జరిగిన కొద్దిసేపటికే బాలిక అదృశ్యం కావడంతో బాలిక తల్లి నగరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంటి వెనుకే గోదావరి నది ఉండటంతో అదృశ్యమైన బాలిక నదిలో దూకేసి ఉంటుందని అనుమానించి గాలింపు చేపట్టినప్పటికీ ఏవిధమైన ఆచూకీ తెలియలేదు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా ఇమామ్‌హుస్సేన్ జయంతి వేడుకలు

మామిడికుదురు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇస్లాం మత వ్యవస్థాపకుడు, మహ్మద్ ప్రవక్త మనుమడైన హజరత్ ఇమామ్ హుస్సేన్ జయంతిని నగరం, మామిడికుదురు, రాజోలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. నగరం గ్రామానికి చెందిన గురుహే మెహర్బానేజెహరా ఆధ్వర్యంలో రాజోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు బ్రెడ్లు, పాలు, స్వీట్లు పంచారు. ఇమామ్ హుస్సేన్ సూచించిన ఉపదేశాలతో ముద్రించిన కరపత్రాలను ఆయా గ్రామాల్లో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సయ్యద్ రూహీ, మస్తాన్‌అలీ, అజీజ్‌హుస్సేన్, జాఫర్ హుస్సేన్, జాఫర్ అబ్బాస్, మహ్మద్‌ఖాశిం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉమాసోమేశ్వరస్వామి విగ్రహప్రతిష్ఠ

మామిడికుదురు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రజా విరాళాలతో బి.దొడ్డవరం గ్రామంలో పునర్నిర్మించిన ఉమాసోమేశ్వరస్వామి ఆలయంలో విగ్రహప్రతిష్ఠా మహోత్సవం శాస్త్రోక్తంగా ఆదివారం జరిగింది. బ్రహ్మశ్రీ పూజ్యం జగన్నాథశర్మ ఆధ్వర్యంలో జరిగిన ప్రతిష్ఠా కార్యక్రమంలో కంభంపాటి సుబ్రహ్మణ్యశ్రీనివాసశర్మ, పోచిరాజు వెంకటరామనాగేశ్వరరావు, పోచిరాజు కిరణ్‌కుమార్ దంపతులు కర్తలుగా పాల్గొని ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

షిర్డీ సాయి నాథునికి ప్రత్యేక పూజలు

మామిడికుదురు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పెదపట్నంలంకలో వేంచేసి ఉన్న శ్రీషిర్డిసాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాలు కాగడ హారతితో మొదలయ్యాయి. కేరళ వాయిద్యకళాకారుల విన్యాసాలు, బుట్టబొమ్మలు, మేళతాళాలతో పల్లకీలో ఉత్సవ విగ్రహాన్ని వైనతేయ నది వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లి అక్కడ నదిలో స్నానమాచరింపచేసి మరలా ఉత్సవ మూర్తిని ఊరేగిస్తూ ఆలయానికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా స్వామివారికి పుష్పాభిషేకం, ధూప్‌హారతి, దీపాలంకరణ, శేజ్‌హారతి కార్యక్రమాలు జరిగాయి. ఆయాకార్యక్రమాల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు సరస్వతీదేవి ఆలయంలో విశేష పూజలు

యానాం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): యానాం గోపాల్‌నగర్‌లో శారదాదేవి ఆలయంలో వేంచేసియున్న శ్రీసరస్వతి అమ్మవారి శ్రీపంచమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం నుంచి ఆలయంలో పంచామృతాలు, పళ్ల రసాలతో దివ్యాభిషేకం నిర్వహించనున్నారు. ఉదయం 8గంటలకు సరస్వతి హోమం, సకల విద్యలకు అక్షర స్వరూపిణి యగు సరస్వతి అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాసం నిర్వహించనున్నారు. సాయంత్రం ఐదు గంటల నుంచి కుంకుమ పూజలు జరగనున్నాయి. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, భక్తులు పాల్గొని అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

జిల్లాస్థాయి అబాకస్-వేదిక్ మ్యాథ్స్ పోటీలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం శ్రీవాగ్దేవి పాఠశాలలో జిల్లాస్థాయి అబాకస్-వేదిక్ మ్యాథ్స్ పోటీలు నిర్వహించారు. అమలాపురం పట్టణ, పరిసర ప్రాంతాల విద్యార్థులతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ విద్యార్థులకు వేదిక్ మ్యాథ్స్ పోటీ పరీక్షలు నిర్వహించడం ద్వారా వారిలో ప్రతిభాపాటవాలు వెలికితీయడంతో పాటు వారి అభ్యున్నతికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. విజేతలకు సర్టిఫికెట్లు,మెడల్స్‌ను డీఈవో అందజేశారు.

పామును పట్టుకున్న వర్మ

కాట్రేనికోన, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కందికుప్పలో ఆదివారం రక్తపింజర పాము వాసు ఇంటి ఆవరణలోని బడ్డీలో ప్రవేశించడంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. భీమనపల్లికి చెందిన జంపన గణేష్‌వర్మకు సమాచారం అందించడంతో ఆయన పామును పట్టుకుని డబ్బాలో బంధించారు.

పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

అంతర్వేది, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గుడిమూల గ్రామంలో నయారా నూతన పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్‌ను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి శ్రేణులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై బీజేపీ నాయకుల హర్షం

మలికిపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ జనరంజకంగా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు వరాల జల్లు కురిపించారని, పోలవరం ప్రాజెక్టుకు గ్రాంటు రూపంలో రూ.12,157 కోట్లు, విశాఖ ఉక్కు పరిశ్రమకు రూ.3,295 కోట్లు కేటాయించారని, పన్ను రాయితీ, వడ్డీ రాయితీ రుణాలు, వడ్డీ రహిత రుణాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

సౌరయాగంలో శ్రీమద్భాగవత ప్రవచనం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): విలసవిల్లి మహాసౌరయాగంలో ఆదివారం చండీహోమం, శ్రీరాజశ్యామల హోమం నిర్వహించారు. యర్రమిల్లి గురుచరణ్‌శర్మ ఆధ్వర్యంలో సూర్యారాధన, సౌర అష్టాక్షరీ జపాలు నిర్వహించారు. వారణాసి కామేశ్వరశాస్త్రి, దెందులూరి సీతారామశర్మ ఆధ్వర్యంలో శ్రీమద్భాగవత పారాయణం జరిగింది. యాగకర్త మున్నంగి రామకృష్ణశర్మ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న దృశ్యం

కిటకిటలాడిన వాడపల్లి వెంకన్న ఆలయం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. నోము ఆచరించిన భక్తజనం అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తలనీలాలు, కానుకలు సమర్పించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తజనం అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.5,33,261 వచ్చినట్లు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.





సరస్వతిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు. పక్క చిత్రంలో సామూహిక సరస్వతిదేవి పూజల్లో పాల్గొన్న చిన్నారులు

భక్తి శ్రద్ధలతో సామూహిక సరస్వతి పూజలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ర్యాలి అన్నపూర్ణాదేవి ఆలయంలో ఆదివారం వసంత పంచమి సందర్భంగా విద్యార్థులతో సామూహిక సరస్వతి దేవి పూజలు నిర్వహించారు. అర్చకుడు ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం కన్నుల పండువగా జరిపారు. అధిక సంఖ్యలో చిన్నారులు సరస్వతి పూజల్లో పాల్గొన్నారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పలకలు, ప్రసాదాలు పంపిణీ చేశారు.



అమ్మవారి ఆలయ గోపురం గుమ్మాలకు పూజలు చేస్తున్న దృశ్యం

నూకాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆలమూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఇరువైపులా ఏర్పాటు చేసిన ఆలయ గోపురాలకు రాతి గుమ్మాలు ఏర్పాటు చేశారు. ఆదివారం గ్రామస్తులు వైట్ల గంగరాజు, గన్ని సూరిబాబు దంపతులు వీటికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అమ్మవారికి పూజలు చేసి పనులు ప్రారంభించారు. గోపురాల నిర్మాణం, రాతి గుమ్మాల ఏర్పాటులో నాయకులు వైట్ల శేషబాబు, గన్ని చిన్నబ్బు, పెద్దింటి కాశి, దేశాబత్తుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి

మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మోడరన్ కళాశాలలో నిర్వహించిన మెరిట్ కం అడ్మిషన్ టెస్టులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆదివారం ప్రోత్సాహకాలు అందించారు. విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి బహుమతులు అందించారు. గ్రామీణ ప్రాంత మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జీవీ రావు కృషి అభినందనీయమని అన్నారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజేష్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమం లో కోనసీమ జిల్లా ఆప్సా అధ్యక్షుడు డి.సత్తిబాబు, వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ ప్రకాష్, అకడమిక్ అడ్వైజర్ సీహెచ్ సతీష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





చినద్వారపూడిలో రామాలయానికి చెందిన భవనంలో విద్యార్థులకు పాఠాలు. పక్క చిత్రంలో చినద్వారపూడిలో నిధుల కొరతతో మధ్యలో నిలిచిపోయిన పాఠశాల నూతన భవనం

నిధుల కొరతతో ముందుకు సాగని పనులు

• గత ప్రభుత్వ నిర్వాకంతో విద్యార్థులకు ఇక్కట్లు • ఐదేళ్ల నుంచి పరాయి పంచనే విద్యాభ్యాసం

మండపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం నాడు-నేడు పథకంలో చినద్వారపూడిలో చేపట్టిన పాఠశాల పునర్నిర్మాణం పనులకు రూ.15లక్షలు వ్యయం చేశారు. ఆ తర్వాత నిధులు లేకపోవటంతో వాటి పనులు నిలిచిపోయాయి. నాడు-నేడు నిధులు రూ.58 లక్షలతో చేయాల్సిన పనులు నిధుల కొరతతో పడకేశాయి. శిథిలా వస్థకు చేరిన పాఠశాల స్థానంలో నాడు-నేడులో భాగంగా గత ప్రభుత్వంలో పాఠశాల నిర్మాణ పనులు చేపట్టారు. ఐదేళ్ల క్రితం చేపట్టిన పనులు నేటి వరకు పూర్తి కాలేదు. దీంతో గ్రామంలో ఎంపీపీ పాఠశాలను ప్రస్తు తం రామాలయానికి చెందిన భవనంలో నిర్వ హిస్తున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు పది మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. వీరంతా ఒకే గదిలో చదువుకుంటున్నారు. విద్యార్థుల గదిలో రామాలయానికి చెందిన సామగ్రి, భవనం మెటీరియల్ వంటివి ఉండటం వల్ల విద్యా భ్యాసానికి ఆటంకం ఏర్ప డుతోంది. పది మంది చదివే ఈ పాఠశాలలో సింగిల్ ఉపాధ్యాయుడు పాఠాలు చెబుతున్నా రు. సొంత భవనం లేక ఏళ్ల తరబడి ఇక్కడి విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. పరాయి పంచన నుంచి మోక్షం కలిగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై మండల విద్యాధికారి నాయుడు రామచంద్రరావును వివరణ కోరగా తొలుత రెండు గదుల కోసం రూ.24 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. మంజూరైన రూ.15 లక్షలతో రెండు గదులు నిర్మించామన్నారు. నిధుల కొరత కారణంగా మిగతా పనులు నిలిచిపోయాయని చెప్పారు. ఐదేళ్ల నుంచి రామాలయానికి చెందిన భవనంలో తరగతులను నిర్వహిస్తున్నామని చెప్పారు. నిధులు విడుదలైతే పనులు చేపడతామని ఆయన చెప్పారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

మామిడికుదురు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒక గ్రామంలో బాలిక అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్టు నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపారు. మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలిక పెదపట్నంలంక జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. తన స్నేహితురాలి వద్ద నుంచి బంగారు గొలుసు తీసుకుని దాన్ని మరొక స్నేహితురాలికి ఇచ్చినట్టు తల్లికి చెప్పింది. తన గొలుసు ఇవ్వమని స్నేహితురాలు తండ్రితో వచ్చి ఆ బాలికను అడగ్గా, ఇచ్చేసినట్టు వారికి బాలిక చెప్పింది. సోమవారం నాటికి తన గొలుసు ఇచ్చేయాలని స్నేహితురాలు చెప్పింది. దీంతో శనివారం సాయంత్రం బాలికను తల్లి మందలించింది. ఇది జరిగిన కొద్దిసేపటికే బాలిక అదృశ్యం కావడంతో బాలిక తల్లి నగరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంటి వెనుకే గోదావరి నది ఉండటంతో అదృశ్యమైన బాలిక నదిలో దూకేసి ఉంటుందని అనుమానించి గాలింపు చేపట్టినప్పటికీ ఏవిధమైన ఆచూకీ తెలియలేదు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సూచిక బోర్డు ఉన్నా ఉపయోగం సున్నా

• తుప్పలతో మూసుకుపోయిన వైనం • పట్టించుకోని ఆర్అండ్‌బీ యంత్రాంగం

కొత్తపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అమలాపురం నుంచి కొత్తపేట ప్రధాన రహదారి చెంతన దూరం తెలిపే సూచిక బోర్డులు తుప్పలతో మూసుకుపోవడంతో పాటు ఒంగిపోయి పడి ఉన్నాయి. దీన్ని ఆర్అండ్‌బీ శాఖ పట్టించుకోకపోవడంతో ప్రయాణికులకు దూరం వివరాలు కనిపించని పరిస్థితి ఏర్పడింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారికి గమ్యస్థానం తెలియక తికమకపడుతున్నారు. ఎప్పటికప్పుడు రోడ్డుపక్కన జంగిల్ క్లియరెన్స్ చేయాల్సిన సిబ్బంది ఉన్నప్పటికి సూచిక బోర్డులను మూసేసిన పిచ్చిమొక్కలను తొలగించడంలో వారు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఒంగిపోయిన సూచిక బోర్డుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం లేదని వాహనదారులు విమర్శలు గుప్పిస్తున్నారు. దీనిపై కొత్తపేట ఆర్అండ్‌బీ జేఈ కె.రవీంద్రను వివరణ కోరగా సూచిక బోర్డులకు అడ్డంగా ఉన్న పొదలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఒంగిపోయిన బోర్డులను యథాస్థానంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.





తుప్పలతో మూసుకుపోయిన సూచిక బోర్డు. పక్క చిత్రంలో ఒంగిపోయి పడి ఉన్న బోర్డు

నేడు సామూహిక అక్షరాభ్యాసం

రావులపాలెం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సత్యసాయి సేవా కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ సభ్యులు మన్యం పర్వతవర్ధనరావు తెలిపారు. ఈ అవకాశాన్ని చిన్నారుల తల్లిదండ్రులు వినియోగించుకుని తమ పిల్లలతో అక్షరాభ్యాసంలో పాల్గొనాలని ఆయన కోరారు.



ప్రధాన రహదారిపై తనిఖీలు చేస్తున్న ప్రొబిషన్ డీఎస్పీ ప్రదీప్తి

డీఎస్పీ వాహనాల తనిఖీ

కొత్తపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ప్రధాన రహదారిలో ప్రొబిషన్ డీఎస్పీ ప్రదీప్తి ఆకస్మిక తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు చలనాలు విధించారు. అనంతరం స్టేషన్‌లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.



అంకంపాలెం గోదావరి ఒడ్డున గుర్తు తెలియని మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు

గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలెం వశిష్ట గోదావరి నది ఒడ్డున గుర్తు తెలియని మృతదేహం ఆదివారం లభ్యమైంది. మృతదేహం వివరాలను వీఆర్వో పోలీసులకు తెలిపారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 30 ఏళ్ల వయస్సు కలిగి ఎరుపు, నలుపు రంగు కలిగిన గడిచొక్కా, నీలిరంగు షార్ట్ ధరించినట్టు పోలీసులు తెలిపారు. వీఆర్వో గిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే ఆత్రేయపురం పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.



ఆలమూరు-మండపేట రోడ్డులో ఉదయం పది గంటల తరువాత కూడా తొలగని మంచు

కప్పేసిన మంచు దుప్పటి

• ఉదయం 10 దాటినా తొలగని మంచు • వాహనదారుల తీవ్ర ఇబ్బందులు

ఆలమూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని పలు ప్రాంతాలు ఆదివారం ఉదయం పొగమంచు కప్పేసింది. సాధారణంగా ఉదయం ఏడు ఎనిమిది గంటల వరకు ఉండే మంచు ఈసారి ఏకంగా పది గంటలు దాటినప్పటికీ మంచు దుప్పటి తొలగిపోలేదు. దీంతో ఆయా రహదారులపై ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ముఖ్యంగా జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులకు ఈ పొగమంచు మరింత ఇబ్బందిని కలిగిస్తోంది. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులకు మంచు కారణంగా ఆలస్యంగా పనులు ప్రారంభిస్తున్నారు.

పసలపూడిలో ఘనంగా పీర్ బాబా గంధోత్సవం

రాయవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి గ్రామంలో ఆదివారం హజరత్ జంగిల్ పీర్ బాబా గంధోత్సవం నిర్వహించారు. బిస్మిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గంధపు బిందెతో గ్రామోత్సవం జరిపారు. పంట పొలాల మధ్య ఉన్న దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గంధోత్సవంలో పలువురు మొక్కుబడులు చెల్లించారు. జిల్లాలోని పలు ప్రాంతాల భక్తులు ఉత్సవంలో మొక్కులు చెల్లించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కమిటీ నిర్వాహకులు అన్న సమారాధన జరిపారు.



పీర్ బాబాను దర్శించుకుంటున్న దృశ్యం

వెంకటస్వామి మృతికి పలువురు సంతాపం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు దొమ్మేటి వెంకటస్వామి(బాబూరావు) మృతికి పలువురు నివాళులర్పించారు. ఆదివారం గాంధీపేట బానోదయ స్కూల్ వద్ద తాలూకా శెట్టిబలిజ సంఘం కార్యవర్గ సమావేశం జరిపారు. ఆయన చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కట్టా సూర్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కడలి రామకృష్ణ, ఎన్.ఏడుకొండలు, పాలిక అప్పారావు, కార్యదర్శి వి.లక్ష్మీనారాయణ, ఏపీఐడీసీ మాజీ డైరెక్టరు వాసంశెట్టి శ్యామ్, పిల్లి సత్యనారాయణ, పెంకె రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



దొమ్మేటి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దేవాలయ ఆస్తులను ప్రభుత్వం రక్షించాలి

రాష్ట్ర మహిళా ప్రముఖ్ సునీత

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): దేవాలయాల ఆస్తులు ఆక్రమణలకు గురికాకుండా ప్రభుత్వం రక్షించాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర మహిళా ప్రముఖ్ సునీత అన్నారు. విజయవాడలో నిర్వహించిన హైందవ శంఖారావ సమ్మేళనం విజయవంతమైందని తెలిపారు. అదే తరహాలో మార్చి నెలాఖరు నాటికి ప్రతీ మండలస్థాయిలో నిర్వహించనున్నట్టు తెలిపారు. వీహెచ్‌పీ జిల్లాశాఖ అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో హైందవ శంఖారావం విజయవంతం చేసిన వారం దరికీ కృతజ్ఞతలు తెలిపారు. అంతర్వేది కల్యాణోత్సవాల్లో భక్తులకు పూర్తిస్థాయిలో ఉచిత దర్శనం కల్పించాలన్నారు. సంస్థాగతంగా విశ్వహిందూ పరిషత్ క్షేత్రస్థాయిలో బలపడేందుకు వేసవి సెలవుల్లో యువతకు వారం రోజుల పాటు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. దేశభక్తి, జాతీయభావం, క్రమశిక్షణ, యోగా, సూర్య నమస్కారాలు, వ్యాయామం, ఆత్మరక్షణ విద్యలు, నిజమైన దేశభక్తుల చరిత్రపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. జిల్లా కార్యదర్శి ప్రయాగ నరసింహమూర్తి, భజరంగ్‌దళ్ రాష్ట్ర ప్రముఖ్ శిరంగు నాయుడు, విభాగ్ కార్యదర్శి గంధం గోవిందు, దుర్గావాహిని ప్రముఖ్ గుత్తుల సుగుణ, నంద్యాల సీతారామ్, ఊటుకూరి సాంబయ్య, వేణుగోపాల్, యక్కల బ్రహ్మేష్ తదితరులు పాల్గొన్నారు.



విశ్వహిందూ పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా ప్రముఖ్ సునీత

28లోగా జీవన ప్రమాణ పత్రాలు అప్‌లోడ్ చేయాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులు ఈనెల 28లోగా జీవన ప్రమాణ పత్రాలు అప్‌లోడ్ చేసుకోవాలని సబ్‌ట్రెజరీ అధికారి సుభాషిణి తెలిపారు. ఇప్పటి వరకు 1100 మంది లైఫ్ సర్టిఫికెట్లు అందించారని తెలిపారు. సబ్ ట్రెజరీ కార్యాలయంతోపాటు విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో కూడా జీవన ప్రమాణ పత్రాలు అప్‌లోడ్ చేస్తున్నారని తెలిపారు. సమాఖ్య ప్రతినిధులు అంపోలు సత్యనారాయణ, పెండ్యాల సుబ్రహ్మణ్యం, పి.త్రినాథరావు, కె.సూర్యభాస్కరరావు, సీహెచ్ రామమూర్తి సేవలందిస్తున్నారు. సబ్ ట్రెజరీ, విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య కార్యాలయాల్లో వీటి సేవలు వినియోగించుకోవాలని సమాఖ్య అధ్యక్షుడు పట్నాల రామకృష్ణారావు కోరారు.

మూర్తి కుటుంబానికి పరామర్శ

కె.గంగవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల తణుకులో చనిపోయిన కె.గంగవరం గ్రామానికి చెందిన ఏజీఎస్ మూర్తి కుటుంబాన్ని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ ఆదివారం పరామర్శించారు. మూర్తి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పంపన సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం'

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందని పీడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ ఆరోపించారు. ఏపీ ప్రజానీకం ఎంతో ఆశతో కేంద్ర బడ్జెట్ వైపు చూశారని కానీ కేంద్ర ప్రభుత్వం అందరి ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. ఏపీకి ఐఐటీ, ఐఐఎం, ఐసర్, ఎన్ఐడి, ట్రిపుల్ ఐటీ, గిరిజన విశ్వవిద్యాలయం, పెట్రో విశ్వవిద్యాలయం వంటి ఉన్నత విద్యా సంస్థలు ఇవ్వలేదన్నారు. విభజన హామీలు కేంద్ర ప్రభుత్వం నెరవేర్చకపోవడం దారుణమన్నారు. బీహార్‌కు బంగారు పల్లెంలో వడ్డించి ఏపీకి అన్యాయం చేసిందన్నారు.



గంగలకుర్రు అగ్రహారంలో వీణ కచేరి చేస్తున్న నాగలక్ష్మి

ఏకాదశ రుద్రుల చరిత్రపై ఆలయాల్లో వీణ కచేరి

అంబాజీపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి చెందిన జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల చరిత్ర తెలుసుకుని ఆయా ఆలయాల్లో వీణ కచేరి చేస్తున్నట్లు నెల్లూరుకు చెందిన ప్రముఖ సంగీత విద్యాంసురాలు శ్రీకంఠం నాగలక్ష్మి అన్నారు. గంగలకుర్రు అగ్రహారం, గంగలకుర్రులోని వీరేశ్వరస్వామి, చెన్నమల్లేశ్వరస్వామి ఆలయాల్లో ఆదివారం వీణ కచేరి జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను శ్రీహరికోటలో ఉద్యోగం చేశానని, సంగీతంపై మక్కువతో ఉద్యోగానికి రాజీనామా చేసి వీణసాధన చేశానన్నారు. తన భర్త మాధవరావు స్ఫూర్తితో తిరుపతి, వారణాశి, తిరువనంతపురం, శ్రీశైలం తదితర ప్రసిద్ధి ఆలయాల్లో వీణ కచేరి చేశానన్నారు. ఏకాదశ రుద్రుల ఖ్యాతిని తెలుసుకుని 11 ఆలయాల్లో వీణ కచేరి చేశానన్నారు. ఏకాదశ రుద్రులను దర్శించుకుని ఆయా ఆలయాల్లో వీణకచేరి చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం శివకేశవ యూత్, గ్రామస్తుల ఆధ్వర్యంలో నాగలక్ష్మిని సత్కరించారు.



క్యూ లైన్లను పరిశీలిస్తున్న కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్

అంతర్వేది ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ

అంతర్వేది, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ తెలిపారు. కొత్తపేట నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన ఆదివారం అంతర్వేది ఆలయానికి విచ్చేశారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు మహదాశీర్వచనం అందించారు. అనంతరం ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, సీఐ నరేష్ కుమార్‌తో కలిసి ఉత్సవ ఏర్పాట్లను వారు పరిశీలించారు. కల్యాణ మండపం, మ్యాప్‌ను పరిశీలించి సామాన్య భక్తులు కూడా కల్యాణం తిలకించి స్వామి దర్శనం చేసుకునేలా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తామన్నారు. అనంతరం క్యూ లైన్లు, రథం రూట్, వన్‌వే రూట్, స్నానఘట్టాలు, కమాండ్ కంట్రోల్ రూమ్, పార్కింగ్ ప్రదేశాలను వారు పరిశీలించారు.